నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 28 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

# తాగునీటికి ముందస్తు చర్యలు చేపట్టండి

## ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

సత్తుపల్లి, మార్చి 27 : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం తల్లాడ మండలం గొల్లగూడెం, తెలగవరం, అంజనాపురం, మిట్టపల్లి, మల్సూర్‌తండా తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా, బోర్లు, ఓపెన్ బావులు, నీటి వనరులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త బోర్లు, పైపులైను మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. మిట్టపల్లిలో పల్లె దవాఖానను తనిఖీ చేసి.. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాధి నిరోధక టీకాలు కచ్చితంగా ఇవ్వాలని, చిన్నారులకు ప్రతి నెలా టీకాలు సక్రమంగా వేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతుల కల్పన, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ప్రహరీలు లేని పోలింగ్ కేంద్రాలకు ఫెన్సింగ్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం హెచ్ఎంలతో సమావేశమై విద్యార్థులు, ఉపాధ్యాయుల నమోదును అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మల్సూర్‌తండాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో చంద్రమౌళి, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఈఈ నాగశేషు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

# ‘ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాలి’

పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

మధిరరూరల్, మార్చి 27 : ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కు వచ్చే ఓటర్లకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మహదేవపురం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లో ఫ్యాన్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యం ఉండే విధంగా చూడాలని సూచించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసే విధంగా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రి తదితరులు ఉన్నారు.

# ఇంటింటికి నీరందేలా చూడాలి

## భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : ప్రస్తుత వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడడంతోపాటు ఇంటింటికి నీరందేలా చర్యలు చేపట్టాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఈఈ, డీఈలు, పబ్లిక్ హెల్త్ డీఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, స్పెషల్ ఆఫీసర్లతో తాగునీరు, పనుల పురోగతిపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రస్తుతానికి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నదని, ఈ క్రమంలో రాబోయే మూడు నెలలపాటు గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు అందించాలన్నారు. నీటి వసతులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో హ్యాండ్ పంపులు, బోర్ వెల్స్, మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. బోర్లు, హ్యాండ్ పంపులు, మోటర్లు, పైపు లీకేజీలను గుర్తించి త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని నీటి సరఫరా ప్రాంతాలను విధిగా తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. అత్యవసరం ఉన్నచోట బోర్ వెల్స్ అద్దె ప్రతిపాదికన ఏర్పాటు చేయాలన్నారు. మండలాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తానని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ముందుగానే తాగునీటి సరఫరాపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విద్యాచందన, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేశ్ పాల్గొన్నారు.

# టార్గెట్@ 1.20 లక్షల మెట్రిక్ టన్నులు

- యాసంగి ధాన్యం సేకరణకు యంత్రాంగం సన్నద్ధం
- జిల్లాలో 223 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- రూ.2,203కు క్వింటా ‘ఏ’ గ్రేడ్ రకం వరి ధాన్యం
- రూ.2,183 మద్దతు ధరతో సాధారణ రకం

ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం (ఫైల్)

ఖమ్మం, మార్చి 27 : జిల్లాలో ఈ యాసంగిలో అన్నదాతలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 223 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఖమ్మం జిల్లాలో ఈ యాసంగిలో 41,477 హెక్టార్లలో అన్నదాతలు వరి పంటను సాగు చేశారు. ఇందులో హెక్టార్‌కు 6.180 మెట్రిక్ టన్నుల చొప్పున దిగుబడి వస్తుందని, తద్వారా జిల్లాలో మొత్తం వరి దిగుబడి 2,56,328 మెట్రిక్ టన్నులు ఉంటుందని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిలో స్థానిక ప్రజల అవసరాలకు 25,632 మెట్రిక్ టన్నులు పోగా.. 2,30,808 మెట్రిక్ టన్నుల ధాన్యం మిగులుతుందని అంచనా వేస్తున్నారు. దీనిలో మిల్లర్లు నేరుగా కొనుగోలు చేసేవి, స్థానిక అవసరాలకు వినియోగించేవి, ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసేవి పోగా.. మిగిలిన 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేయనున్న 223 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

### సిద్ధంగా గన్నీ బ్యాగులు..

అయితే యాసంగి ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేస్తున్న 223 కొనుగోలు కేంద్రాల్లో డీఆర్‌డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో 41, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 152, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 30 కేంద్రాలు ఉండనున్నాయి. 30 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా.. కోటి గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి వసతి, కరెంట్, టార్పాలిన్ కవర్లు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ స్కేళ్లు, మాయిశ్చరైజ్ మీటర్లు తదితర వాటిని ముందస్తుగానే ఏర్పాటు చేయనున్నారు. మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం వరి ధాన్యానికి క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర అందించనుంది. అలాగే, ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ నుంచి జూలై ఆఖరు వరకు కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

### వెనువెంటనే రైస్ మిల్లులకు..

ఐకేపీ నుంచి మిల్లులకు తరలిస్తున్న లారీ(ఫైల్)

కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం వెనువెంటనే రైస్ మిల్లులకు తరలించనున్నారు. రైస్ మిల్లులో కస్టమ్ మిల్లింగ్ చేయిస్తే నూకల శాతం అధికంగా ఉంటుంది. కొనుగోలు కేంద్రాల్లో ఒక లారీకి సరిపడా వరి ధాన్యం బస్తాల తూకం పూర్తయిన వెంటనే కస్టమ్ మిల్లింగ్ కోసం తరలిస్తారు. ఈ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చడం ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది.

# పంటలు ఎండుతున్నా పట్టించుకోరా..

## జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

బోనకల్లు, మార్చి 27 : యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నా పట్టించుకోరా.. అని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ప్రశ్నించారు. బుధవారం బోనకల్లు, ఆళ్లపాడు గ్రామంలో ఎండిపోయిన మొక్కజొన్న, వరి పంటలను జడ్పీ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు ఎన్నో కష్టాలు పడి పంటలు సాగు చేస్తున్నారని, తీరా పంట చేతికొచ్చే సమయంలో నీరందక ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. బోనకల్లు మండలంలో ఏడాది క్రితం ఎండిపోయిన పంట పొలాలను అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా పరిశీలించి పరిహారం అందజేశారని గుర్తు చేశారు. కనీసం డిప్యూటీ సీఎం ఉన్న నియోజకవర్గంలో రైతుల కష్టాలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల బాధను గుర్తించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, రైతు నాయకులు వేమూరి ప్రసాద్, జంగ రవి, పాల ప్రసాద్, గద్దల వెంకటేశ్వర్లు, యార్లగడ్డ నర్సింహ, మోర్ల నర్సింహారావు, వల్లెబోయిన కొండలరావు, మోదుగుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

## అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం, మార్చి 27 : జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) లక్ష్యాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన గడువులోగా సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలని, లేదంటే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. జిల్లాలో మొత్తం 223 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 152, ఐకేపీ 42, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 30 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులతోపాటు టార్పాలిన్, ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులు, వేయింగ్ మిషన్ వంటి సౌర్యాలు కల్పించాలన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున కొనుగోలు కేంద్రాలకు రాజకీయ నాయకులతో ప్రారంభోత్సవాలు చేయించవద్దని సంబంధిత అధికారులకు సూచించారు. వ్యవసాయ, ఐకేపీ, సహకార శాఖ, హార్టికల్చర్ సంబంధిత శాఖల అధికారులు బృందంగా ఏర్పడి కొనుగోళ్లను పర్యవేక్షించాలన్నారు. సమీక్షా సమావేశంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, డీఎం సివిల్ సప్లై శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షానే నిలబడతాం

## ఆత్మీయ సమ్మేళన సభలో

## కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

లక్ష్మీదేవిపల్లి, మార్చి 27: పేదలు, కార్మికులు, కర్షకుల కోసమే పుట్టిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా తమ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షమే వహిస్తుందని అన్నారు. ఐదు దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అందించిన సేవల ఫలితంగానే తనను మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నుకొని చట్టసభకు పంపారని గుర్తుచేశారు. మండలంలోని చాతకొండ హమాలీ కాలనీలో స్థానిక ప్రజలు బుధవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి ఎప్పుడూ ప్రజాదరణ లభిస్తూనే ఉంటుందని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ విషయాన్ని మరోసారి స్పష్టం చేశాయని అన్నారు. అహంకారంతో విర్రవీగే నాయకులను, ప్రజాప్రతినిధులను ప్రజలు ఎప్పటికీ ఆదరించరని అన్నారు. సీపీఐ నాయకులు సాబీర్‌పాషా, సారయ్య, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ‘అద్దె’ చెల్లింపులేవి?

- కిరాయి ఇళ్లలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- అవస్థలు పడుతున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులు
- జిల్లాలో ఏడు నెలలుగా పెండింగ్‌లోనే అద్దె బకాయిలు

అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

సత్తుపల్లి, మార్చి 27 : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. దీంతో అరకొర వసతులున్న అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ టీచర్లు ఆయా కేంద్రాలను నెట్టుకొస్తున్నారు. జిల్లాలో మొత్తం ఏడు ప్రాజెక్టుల పరిధిలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ఆయా ప్రాంతాల్లో ఇరుకు ఇళ్లలోనే అద్దె కేంద్రాలు నడుపుతున్నారు. దీంతో టీచర్లు, చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. దీనికి తోడు అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బిల్లులు సకాలంలో రాకపోవడంతో టీచర్లు, సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు.

### జిల్లాలో 1,840 కేంద్రాలు..

ఖమ్మం జిల్లాలో ఏడు అంగన్‌వాడీ ప్రాజెక్టుల కింద 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 958 సొంత భవనాలు, 448 అద్దె భవనాలు, 434 ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే 448 కేంద్రాలను గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అద్దెకు తీసుకుని కేంద్రాలు నడిపిస్తున్నారు. మరో 434 కేంద్రాలను ప్రైమరీ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల వంటి ప్రభుత్వ భవనాల్లో కొనసాగిస్తున్నారు.

### అద్దె నిబంధనలు ఇలా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దె చెల్లింపులకు పారిశుధ్యం, నీటి సదుపాయం, 500 గజాల స్థలం కలిగి ఉండాలి. రెండు గదులతోపాటు కిచెన్ రూమ్ వేరుగా ఉండాలి. నిబంధనల మేరకు ప్రభుత్వం ఇచ్చే అద్దె అరకొరగా ఉండడంతో ఇళ్లు లభించక అంగన్‌వాడీ టీచర్లు అరకొర వసతుల మధ్యే భవనాలను కొనసాగిస్తున్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు, ప్రాథమిక పాఠశాలల్లో సైతం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నారు. నెలవారీగా కేంద్రాలకు చేరే బియ్యం, గుడ్లు, పౌష్టికాహారం, ఆట వస్తువులు దాచేందుకు కూడా కష్టతరంగా మారింది. పట్టణ ప్రాంతాల్లో అంగన్‌వాడీలకు రూ.1,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.750 చొప్పున అద్దె చెల్లిస్తుండడంతో ఆ అద్దెకు ఇళ్లు దొరక్క తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

### ఏడు నెలలుగా పెండింగ్‌లో అద్దెలు..

జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు నుంచి అద్దె బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు ఇంటి యజమానులకు సమాధానం చెప్పలేక ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు టీచర్లు చేసేది ఏమీలేక సొంత డబ్బులు చెల్లిస్తూ కేంద్రాలను నెట్టుకొస్తున్నారు.

# సాగులో నూతన విధానంపై దృష్టి పెట్టండి

## డీఏవో విజయనిర్మల

రైతు వేదికలో మాట్లాడుతున్న డీఏవో విజయనిర్మల

కూసుమంచి, మార్చి 27 : సాగులో నూతన విధానంతో పాటు ఇతర ఆదాయ మార్గాలపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయ నిర్మల అన్నారు. కూసుమంచి రైతు వేదికలో బుధవారం జరిగిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సాగులో తక్కువ నీటిని వినియోగిస్తూ ఎక్కువ పంటలు పండిస్తూ లాభాలు గడించే విధంగా మెళకువలు తెలుసుకోవాలన్నారు. సమగ్ర వ్యవసాయ విధానంలో డ్రోన్‌ల గురించి అవగాహన పెంచుకోవాలని, పంట మార్పు, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ గోవర్ధన్ మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు కోళ్లు, గొర్రెలు, ఆవులు, గేదెల పెంపకంపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. మార్కెట్‌లో చేపలకు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో చేపల చెరువుల ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. డాక్టర్ రాంగోపాల్ వర్మ.. డ్రోన్ పరికరం ఆవశ్యకత గురించి వివరించారు. తక్కువ సమయంలో డ్రోన్ పరికరంతో ఎక్కువ విస్తీర్ణంలో మందు పిచికారీ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ్‌చంద్ర, ఏవోలు వాణి, సీతారాంరెడ్డి, నాగేశ్వరరావు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పించాలి

## అదనపు కలెక్టర్ వేణుగోపాల్

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

చండ్రుగొండ, మార్చి 27 : పార్లమెంటు ఎన్నికల నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. బుధవారం మండలంలోని సుగ్గల బాబు రైస్‌మిల్‌ను తనిఖీ చేసిన ఆయన మిల్లు యజమానికి పలు ఆదేశాలు జారీ చేశారు. మిల్లింగ్‌లో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేశారా.. లేదా.. అని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఎన్నికల నియమావళి గురించి మండల అధికారులకు వివరించారు. ఏ ఒక్క పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఏవో వినయ్, ఆర్ఐ అక్బర్, బూత్ లెవల్ అధికారులు ఉన్నారు.

# నగరంలో మూడు ఆసుపత్రులు సీజ్

పాజిటివ్ హోమియో కేర్‌లో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి

ఖమ్మం సిటీ, మార్చి 27: నగరం నడిబొడ్డున అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్న పలు దవా(గా)ఖానాలపై బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు కొరఢా ఝుళిపించారు. లింగ నిర్ధారణ అనేది చట్టవిరుద్ధమని తెలిసి కూడా అక్రమాలకు తెరలేపిన వైరా రోడ్డులోని ఆదర్శ హాస్పిటల్‌పై దాడులు నిర్వహించిన పోలీసు యంత్రాంగం నిర్వాహకులపై కేసులు నమోదు చేసిన విషయం విదితమే. తాజాగా డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు సారథ్యంలో అదే ఆసుపత్రిలో సోదాలు జరిపారు. రికార్డులను, స్థానిక విభాగాలను తనిఖీలు చేసిన అధికారులు చివరకు దవాఖానకు తాళం వేశారు. అనంతరం సమీపానే కొనసాగుతున్న తులసి డెంటల్ హాస్పిటల్‌కు వెళ్లారు. స్థానికంగా వైద్యుడు లేకపోవడాన్ని, ఓ నర్సు రోగులకు వైద్యం చేస్తుండడాన్ని గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ బయటికి పంపించి సీజ్ చేశారు. పక్కనే ఉన్న పాజిటివ్ హోమియోకేర్‌కు వెళ్లి లైసెన్స్ చూపించాలని అడిగారు. నిర్వాహకులు నీళ్లు నమలడంతో సదరు వైద్యశాలను మూసి వేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక నుంచి ఖమ్మం జిల్లాలో నడుస్తున్న ప్రతీ వైద్యశాలపైనా నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. డెమో కాశీనాథ్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.